# నిరీక్షణ

మధ్యతరగతి ప్రజలు ఎగువ మధ్యతరగతికి ఎదగటం వలన అనుబంధాలు, అప్యాయతలు మరింత దూరంగా జరిగి మనిషిని మరింత చింతాక్రాంతుడ్ని చేస్తాయన్న వాస్తవానికి ప్రతిరూపమే ఈ 'నిరీక్షణ.'

మనసు కిటికీకి అడ్డుగా వున్న 'స్వార్థం తెరల్ని' తొలగించి, అప్యాయత కోసం నిరీక్షిస్తున్న పెద్దవారిని ఆదుకునే శుభారంభాలు త్వరితంగా జరగాలని కోరుకుందాం.

- ఎమ్మార్వీ. సత్యనారాయణమూర్తి ( పెనుగొండ )

ధర్మయ్య :

ఉదయం తొమ్మిది. మంచంలో పడుకుని వున్నాను. ఒళ్ళంతా విరగ్గొట్టినట్లయింది. మూడు రోజులు జ్వరం. నిన్న తగ్గింది. దాసు పిల్ల- పదిహేనేళ్ల చుక్క- ఇంత పథ్యం ముద్ద పెట్టింది. ఇప్పుడు కాఫీ ఇచ్చి వెళ్లింది. ప్రకాశం కొడుకు చైతన్య వచ్చాడు.

"తాతగారూ... మందేమైనా తేవాలా?" అంటూ.

"ఏమీ అక్కర్లేదురా... చదువుకో. నీ పని చూసుకో!" అంటే తల ఊపి వెళ్లిపోయాడు. దాసూ, ప్రకాశం ఇరుగిల్లూ, పొరుగిల్లూ.

వేసవి శలవులయిపోతున్నాయి. ఇవ్వాళ మే పదిహేను. ఈ ఏడాదీ నెల ముందు నుంచే నా పోరు మొదలెట్టాను. శలవుల్లో పిల్లల్ని తీసుకుని ఇంటికొచ్చి పదిరోజులుండి పొమ్మని. "చూద్దాం.., చెప్తాను" సమాధానాలతోనే రోజులు గడిచిపోతున్నాయి.

మురళి నుంచి ఏ సమాచారమూ లేదు. ఈసారీ వచ్చే సూచనలు లేవు. ఓపిక చేసుకుని లేచి, బయటికి పోయి ఫోన్ చేసొస్తే... రిలీఫ్‌గా ఉంటుంది. ఏమో... పిల్లలిద్దరూ ఏ సమ్మర్ క్యాంప్‌లో ఉన్నారో?! తల్లీ, తండ్రీ ఆఫీస్ కదా... సెలవుల్లో ఇలాంటి ప్రోగ్రామ్స్ పెడుతూ వుంటారు. అదీగాక, డాక్టర్ చెప్పాడు నిన్న-

"బీపీ ఈసారి చాలా ఎక్కువైంది. ఆలోచనలు తగ్గించండి. హార్ట్ ట్రబులూ, షుగరూ, బీపీ, ఇవో ట్రిప్లెట్. చాలా జాగ్రత్తగా ఉండాలి."

కానీ, పారపోసుకున్న నా ఆలోచనల పూసల్ని ఏరుకోకుండా ఎలా ఉండగలను?

నా భార్య శాంతా, నేనూ ఎంతో కష్టపడి ఏర్పాటుచేసుకున్న ఇల్లు. తీరా నేను రిటైరయి, ఇల్లు పూర్తయ్యేసరికి- తాను పోయింది. మిగిలింది- ఇంట్లో ఒంటరిగా నేను. అప్పుడప్పుడూ కిచకిచలాడుతూ ఎగురుకొచ్చే పిచుకలు! కోటి కోరికల కూటమిగా కలలు కన్న ప్రశాంత జీవనం- ఇదిగో ఇట్లా మిగిలింది! ఇల్లంతా బావురుమంటూ వుంటుంది.

ముగ్గురు పిల్లలు. చక్కని చదువులు చెప్పించాం. పెళ్ళీపేరంటాలు జరిపించాం. ముగ్గురూ స్థిరపడ్డారు. పెద్దవాడు విశ్వం, వాడి భార్య మనస్విని. అమెరికా వాసులు. సాఫ్ట్‌వేర్ దంపతులు. చూసి అయిదేళ్లయింది.

"ఇల్లు కదిల్తే మనిషికి ఐదువేల డాలర్లు నాన్నా!" అంటాడు. అత్తగారు పోయినప్పుడూ రాలేదు మనస్విని. పెళ్ళి చేసుకుని పదహారో రోజున వెళ్లటమే. మళ్లీ రాలేదు. ఒక్కగానొక్క బిడ్డ రజని. "గ్రాండ్‌పా!" అంటూ ఫోన్‌లో పలకరింపు నవ్వు నవ్వుతుందా బిడ్డ. కంప్యూటర్ ఫోటోలు చూశాడు.

రెండో కొడుకు మురళి. పూణెలో ఉద్యోగం. భార్యాభర్తలు సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్. "భార్య సీతనీ, పిల్లలిద్దర్నీ తీసుకుని ఒక్కసారి వచ్చి పోరా..." అని నా పోరు.

'అదిగో, ఇదిగో...' అంటారు. సీత తియ్యగా మాటలు చెప్తుంది. పిల్లల చేత ఫోన్‌లో మాట్లాడిస్తుంది. అన్నీ శుష్కప్రియాలూ, శూన్యహస్తాలూ! మురళి 'హిజ్ మిసెస్ వాయిస్' తరహా. మాట్లాడడు.

ఇంక స్వప్న గురించేం చెప్తాను లెండి. మగవాడు ఏ స్వర్గం ధారాదత్తం చేసినా ఆడపిల్ల ఆడపిల్లే కదా. ఆమె స్వేచ్ఛ అంతా మా అల్లుడు రామ్మూర్తి చేతిలోనే పదిలంగా ఉంటుంది. ఇక రామ్మూర్తేమో తెల్లకాకి చందం! "ఏ వార్తా లేకపోతే ఉభయకుశలమే మామయ్యగారూ!" అంటాడు. "అంతా ఓకే. మీరు వర్రీ అయి మమ్మల్ని వర్రీ చేయకండి. మీరు మరీ సెంటిమెంటల్ సార్!" అని నోరు మూయిస్తాడు. వాళ్ళకీ ఇద్దరు ఆడపిల్లలు. రామ్మూర్తీ, స్వప్నా చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు.

అసలీ సాఫ్ట్‌వేర్ వాళ్ళ మనసులు హార్డ్‌వేర్ అనిపిస్తుంది నాకు.

నా ఆరోగ్యం ములక్కాడలా పెళుసని తెలిసీ వచ్చి చూసిపోదామనుకోరు. మాటవరస కన్నా తమ దగ్గరికి వచ్చి ఉండమనరు. నిజానికి నా మనసులో అసలైన బాధ ఇదేనేమో? అయినా, పిచ్చి సన్నాసులు- వాళ్ళ అవస్థలు వాళ్ళకున్నై. వాళ్ళ జీవనశైలి వేరు అనిపిస్తూనూ ఉంటుంది. వాళ్ళ పరిస్థితికి జాలి కలుగుతూ వుంటుంది.

కానీ- నా స్థితికి? ఉన్నట్టుండి ఏ క్షణాన ఏం జరుగుతుందో అన్న భయం, బెంగ, దిగులు. ఉన్న జబ్బులు ఊరుకోకుండా హఠాత్తుగా మంచం పాలు చేస్తే..? పిలిస్తే పలికే వారేరీ? ఇరుగింటి దాసూ, పొరుగింటి ప్రకాశమూ, వాళ్ళ పిల్లలూనా? వారైనా నాకు గార్డియన్‌లుగా ఉండగలరా ఎల్లకాలమూ?

నా ఆలోచనల్లో నేనుండగానే మజ్జిగ తెచ్చింది చుక్క. తాగి గ్లాసు ఆమె కిచ్చాను. వెళ్తున్న ఆ పిల్లని చూస్తూంటే బంధాలూ, బాంధవ్యాలూ, మానవ సంబంధాల గురించిన ఆలోచనలు మనసుని ముప్పిరిగొన్నాయి.

"కాస్సేపు విశ్రాంతిగా పడుకోండి తాతయ్యగారూ..." అని మళ్లీ లోపలకొచ్చి చెప్పింది చుక్క. నేను సన్నగా నవ్వుకున్నాను. "అలాగేలేమ్మా!" అని నడుం వాల్చాను.

పక్కకి తిరిగి పడుకున్నాను. కునుకు పడుతోంది.

మురళి :

అవును. నాన్న చెప్పేవన్నీ వాస్తవాలే... ఒప్పుకుంటాను.

కానీ, మా పరిస్థితి చూడండి. నిబంధనల ప్రకారం మేము వారానికి నలభై ఏడున్నర గంటలు పనిచేస్తే చాలు. కానీ, నేను టీమ్ లీడర్‌ని. ఈ సమయం లెక్కకే రాదు. ఎప్పుడూ ఏవో రిలీజ్ డేట్స్, డెలివరీ రిమైండర్స్ తరుముతూ ఉంటాయి. ఏ ఒక్కరోజునో సాయంత్రం కొంచెం ముందుగా ఇంటికి బయల్దేరితే... సరిగ్గా ఆ సమయానికే క్లయింట్- అంటే మా అమెరికా మొగుడు నుంచి ఫోనొస్తుంది. ఆ రోజుకిక 'మన ఖర్మ' అని మనం నిందించుకోవటమే. టీమ్ లీడర్‌గా క్రిందవాళ్ళ నుంచి పని తీసుకోవటం ఒక కళ, శాస్త్రం, దక్షత! అన్నింటికీ మించి అదృష్టం కూడా! వీటికితోడు ఈ ఫీల్డ్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ కాకుంటే- ఎందుకూ కొరగాకుండా- చెల్లని నాణెంలా మిగిలిపోతాం. అందుకని పరుగో.. పరుగు! రోజులూ, నెలలూ, సంవత్సరాలూ గిర్రున తిరిగిపోతున్నై. మన ప్రమేయం లేకుండా కాలం- మన వేళ్ల సందుల్లో నుంచి జారిపోతూ ఉంటుంది... 'మౌస్' కదలికల్లో నుంచీ పారిపోతూ వుంటుంది! ఎవరితోనైనా మాట్లాడదా మన్నా విసుగూ, చిరాకూ. నా పిల్లల్నే నేను పలకరించలేకపోతున్నానన్న బాధ.

చూడండి... ఇప్పుడు రాత్రి పదకొండు! తాళం తీసుకుని ఇంట్లో ప్రవేశించాను. సీత- తాను అలసిపోయి వచ్చివుంటుంది. డ్రస్ కూడా మార్చుకున్నట్టు లేదు. మంచం మీదపడి అదమరిచి నిద్రపోతోంది. పిల్లలిద్దరూ ఆ ప్రక్క మంచం మీద. వాళ్ళు డిస్టర్బ్ కాకూడదనే- ఇంటి తాళంచెవులు ఎవరి సెట్ వాళ్ళ దగ్గర! బతుకు యాంత్రికంగా తయారైంది. నేనూ నా మంచం చేరాను. తెల్లవారా, పొద్దుగూకా అన్నట్టుంది రొటీన్!

ఇంకో పార్శ్వం గురించి చెప్పేందుకే లేదు. అదిగో... సీత కదులుతోంది. మొగుడుపెళ్ళాల కీచులాటలు, అభిప్రాయ భేదాలు. మనసు రగిలించుకోవడాలూ, చివరికి గతిలేక సర్దుకుపోవడాలూ... లోలోపల ఏడుస్తూ, పైకి ఏడవలేక నవ్వడం... అదొక కథ! మా బతుకులు దూరపు కొండల నునుపు. దగ్గరకొచ్చి చూస్తే అడవులు, కొండలూ!

మా మధ్యకి నాన్నని తెచ్చి ఏం చేయాలి? ఈ వాతావరణంలో ఆయన ఒదగగలడా? ఆయన ఇమిడినా మేమాయన పట్ల కనీస శ్రద్ధ చూపగలమా? నాన్నకి మా బాధలు ఏమని చెబుతాం? ఎన్నని చెప్తాం. చెప్పి బాధపెట్టడం కంటే చెప్పకుండా చెడ్డవాళ్ళం కావటమే మేలు కదూ?

నాకు కునుకు పడుతోంది.

ధర్మయ్య :

ఏడాది గిర్రున తిరిగొచ్చింది.

మురళీ రాలేదు. విశ్వమూ రాలేదు. జరగాలని వాంఛించినవేవీ జరగలేదు. జరగకూడనివి జరుగుతూనే ఉన్నాయి. ఆరోగ్యం నానాటికీ తీసికట్టుగా తయారౌతోంది. ఆ కాస్త ముద్ద ఉడకేసుకోలేకపోతున్నాను. విశ్వంకీ, మురళికీ, స్వప్నకీ నా పరిస్థితిని వివరంగానే తెలిపాను. ఫోన్ల మీద ఫోన్లు, ఆందోళన, పరామర్శలు.

రాత్రి– రామ్మూర్తి ఫోన్ చేశాడు... "మీరిక అక్కడ దుకాణం బంద్ చేసి మా దగ్గరొచ్చేయండి మామయ్యగారూ! మీరిలా ఒంటరిగా బాధలు పడటం భావ్యం కాదు. కలోగంజో కలిసే తాగుదాం... రండి."

ఆ తర్వాత స్వప్న చెప్పింది– "మీ అల్లుడుగారు సిన్సియర్‌గానే చెప్తున్నారు నాన్నా... వచ్చేయ్!" అని. అవునూ– స్వప్న దగ్గరికి పోయి వుంటే కొడుకులేమనుకుంటారు? ఉన్నదంతా కూతురికి ఊడ్చిపెడుతున్నానని గయ్‌మని లేస్తే? కాదంటే మరి? ఛస్తూ బతుకుతూ, పూటలు గడపటం ఎట్లా? ఉన్నట్టుండి కాలో, చెయ్యో కూడా పడిపోతే? ఏమిటి నిర్ణయం? అసలు నా మెదడులో నిర్ణయాలు తీసుకునే భాగం పనిచేస్తోందా?

గాలి లేదు. ఇల్లంతా ఇరుగ్గా వుంది. నిజానికి మనసే అట్టా ఉంది. కిటికీలు ఎత్తుగా ఉన్నై. తెర తొలగిస్తే గానీ ప్రాణానికి హాయిగా ఉండదు..!!

'సూర్య' దినపత్రిక 'ఆదివారం అనుబంధం'... 18 మే ' 2008 సంచికలో ప్రచురితమైన కథ